క్లుప్తంగా

నేలటూరులో శివయ్యకు పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో బుధవారం 259వ మాస శివరాత్రి పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక నీలాంబికా సమేత బసవేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో శివయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ, 21 ఏళ్ల ఏడు నెలల నుంచి గ్రామంలో మాస శివరాత్రి పూజలు చేస్తున్నామన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): ఆరోగ్య సమస్యలతో సతమతమైన నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం 28 మంది లబ్ధిదారులకు రూ.20.36లక్షలు విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



మండపేటలో నాగేశ్వరరావును సత్కరిస్తున్న కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని జిల్లా ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండపేటలోని ఏకుల సత్యనారాయణ కల్యాణ మండపంలో బుధవారం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండపేట కార్మిక శాఖ అధికారి కాశి నాగ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, కార్మికులకు ప్రభుత్వం తరపున అందజేసే సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల్లో లబ్ధిపొందేందుకు కార్మిక శాఖ ద్వారా జారీ చేసే గుర్తింపు కార్డులు కలిగి ఉండాలన్నారు. ఇప్పటికే ఉన్నవారు నిర్దేశిత గడువులోగా రెన్యూవల్ చేసుకోవాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కట్టా వెంకటరమణ మాట్లాడుతూ, సంఘాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం నాయకుడు శెట్టి నాగేశ్వరరావును సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ టీవీ గోవిందరావు, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చాగంటి నరసింహారావు, సహాయ కార్యదర్శి వంగలపూడి శివకుమార్, కోశాధికారి సత్యవర రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

కె.గంగవరం: రైతులందరూ తప్పని సరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏఓ సద్గురు మూర్తి అన్నారు. మండల పరిధిలోని యండగండి, పామర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నమోదు కార్యక్రమం అన్ని గ్రామాల్లో మొదలైందన్నారు. రైతులు ఎకరానికి రూ.80 నామ మాత్రపు ప్రీమియంతో ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనల మేరకు మాత్రమే ఎరువులు వాడాలన్నారు. ఎక్కువగా వాడితే పంట నష్టంతో రైతులు ఆర్థికంగా నష్టపోతారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హేమంత్, వీఏఏ హరిబాబు, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి



సౌర విద్యుత్‌పై మాట్లాడుతున్న కమిషనర్

కపిలేశ్వరపురం (మండపేట): పీఎం సూర్యఘర్ పథకంపై సచివాలయ ఉద్యోగులు పట్టణ నివాసితులకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ అధికారుల సమక్షంలో బుధవారం పథకం ప్రయోజనాలపై ఉద్యోగులకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంతో విద్యుత్ చార్జీలు తగ్గుతాయన్న కీలక అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్లు డి.పవన్‌కుమార్, అనుష లక్ష్మి పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్ బాదలో ఉన్న మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు బుధవారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు ఉండి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పసుపు కుంకుమ, స్వీట్లు, పండ్లతో అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. సామూహికంగా లలితా పారాయణం చేశారు.

మోసాలకు బ్రాండ్.. చంద్రబాబు

- రెడ్‌బుక్ పాలనను అమలు చేస్తున్న టీడీపీ
- సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు
- కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న త్రిమూర్తులు, పార్టీ నేతలు

రాయవరం: సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని, దీనిపై ప్రశ్నిస్తున్న నాయకులపై బెదిరింపులకు దిగుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' మండల స్థాయి సమావేశం మండల సీనియర్ నాయకుడు వెలగల సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, పోలీసులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వ తప్పిదాలను విమర్శిస్తున్న ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు రెడ్‌బుక్ పాలనను అమలు చేస్తూ.. ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా ఖూనీ చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తామని చెప్పి ఇప్పుడు సూపర్ సిక్స్ అమలుకు రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ నిస్సిగ్గుగా మాట్లాడటం వారికే చెల్లిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా మారితే, నేడు సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

రాష్ట్రంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను కూటమి ప్రభుత్వం నిలువునా మోసగించిందన్నారు. ఇంటింటికీ రేషన్ అందించే ఎండీయూ వాహనాలను మూలకు చేర్చి, ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడం మర్చిపోయారన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలను మోసగించిన విధానాన్ని గడపగడపకూ పార్టీ నేతలు, కార్యకర్తలు తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు త్రిమూర్తులు పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను అడుగడుగునా ఎండగట్టాలన్నారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగించిన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేశారని ఆయన పేర్కొన్నారు. సంక్షేమానికి కొత్త అర్థం చెప్పిన నేతగా జగన్‌మోహన్‌రెడ్డి కొత్త చరిత్రను రాశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషను ఆపేసి, మద్యాన్ని 24/7 ప్రజలకు అందుబాటులో ఉంచుతోందని ఆరోపించారు. లిక్కర్



సమావేశానికి హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు

స్కామ్‌లో తప్పుడు కేసులు పెట్టి ప్రజలను తప్పుదోవ పెట్టిస్తున్నారన్నారు. 2014లో రుణ మాఫీ హామీ ఇచ్చి చంద్రబాబు మోసం చేశారని, ఇప్పుడు కూడా అదే తరహాలో మోసాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

నియోజకవర్గ పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్యకుమార్ మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో సూపర్ సిక్స్‌తో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, చంద్రబాబు ప్రజలను మోసం చేయడంలో గిన్నిస్ బుక్ రికార్డు స్థాయిలో ఉన్నారని విమర్శించారు. పటిష్టమైన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి, తద్వారా కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోను రీకాల్ చేసి, బాబు చేసిన మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు వివరించాలన్నారు. అనంతరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జిల్లా అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకుడు వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు చంద్రమళ్ల రామకృష్ణ, కడలి పద్మావతి, వాసంశెట్టి వెంకట్రావు, ఎంపీటీసీ పలివెల ఆదివెంకటలక్ష్మి, కాళ్ల అప్పారావు, పార్టీ నేతలు సత్తి వెంకటరెడ్డి, చింతా సుబ్బారెడ్డి, పాలిక గోవిందు, కత్తుల అప్పారావు, పలివెల మధు, సాధనాల శివ, చిక్కాల శ్రీరాములు, యరమాటి వెంకన్నబాబు, పోతంశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన



డ్రోన్ స్ప్రే వినియోగంపై రైతులకు జేడీఏ సూచనలు

కాజులూరు: వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ మేలైన దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. తర్లంపూడిలో మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అధ్యక్షతన బుధవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో విజయ్‌కుమార్ పాల్గొని క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ వనరుల కొరత కారణంగా వ్యవసాయ రంగంలోనూ యంత్ర పరికరాల అవసరం పెరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వ్యవసాయ డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తుందని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయోగాత్మకంగా నానో యూరియాను డ్రోన్ ద్వారా పొలంలో పిచికారీ చేసి డ్రోన్ వినియోగింపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరప ఏడీఏ కె.బాబురావు, విస్తరణ అధికారి శ్రీనివాసవర్మ, సర్పంచ్ నరాళ బాలరాజు, ఎంపీటీసీ గొల్లపల్లి సింహాద్రి, పీఏసీఎస్ చైర్మన్ కొండమూరి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

మలుపే ప్రమాదాలకు పిలుపు



కోలంక వద్ద ప్రమాదాలకు నిలయమైన మలుపు

కాజులూరు: ద్రాక్షపూడి- యానాం వెళ్లే రహదారిలో మండలంలోని కోలంక వద్ద ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. హైస్కూల్ సమీపంలో పొలమూరుపాడుకు వెళ్లే రోడ్డు వద్ద ఉన్న ఈ మలుపులో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ మలుపు ఇరుకుగా ఉండటంతోపాటు, ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాహనాలు అదుపుతప్పి వాటిని ఢీకొడుతున్నాయి. దీంతో సగటున నెలకు రెండు నుంచి మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు మృత్యువాత పడగా.. చాలా మంది క్షతగాత్రులయ్యారు. ఇటీవల కొన్ని రోజుల క్రితం తాళ్లరేవు మండలం కాపులపాలెంకు చెందిన వ్యక్తి బైక్‌పై దాక్షరామ వెళ్తూ.. ఈ సెంటర్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో మలుపు వద్ద రోడ్డును వెడల్పు చేసి విద్యుత్ స్తంభాలను మార్చి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు మొర పెట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న మురళి

రామచంద్రపురం: భారత స్వాతంత్ర్య యోధుడు, విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని వైఎస్సార్ నగర్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామచంద్రపురం బార్ అసోయేషన్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఏజీపీ పిల్లి మురళీ మోహన్ వెంకట రమణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు దేశ భక్తి గురించి సూచనలు చేశారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప దేశభక్తుడు చంద్రశేఖర్ ఆజాద్ అని కొనియాడారు. అనంతరం విద్యా సామాగ్రిని విద్యార్థులకు మురళి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, జై భీమ్ సైనిక్ నాయకుడు బుంగరాజు, పీడీఎస్‌యూ నాయకులు నాగరాజు, ఎస్‌డీ కరీం, నల్లా వెంకటేశ్, సుధాకర్, పాఠశాల హెచ్‌ఎం జి.శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగలు అరెస్ట్.. హోంగార్డుకు సత్కారం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్

రామచంద్రపురం: మండలంలోని నవరత్నాలగరువు రోడ్డు పక్కనే ఉన్న తాతపూడి గోవిందు ఇంటిలో ఈనెల 21న దొంగతనం జరిగింది. వారిని పట్టుకునేందుకు కృషి చేసిన హోంగార్డు కె.వెంకటేశ్వర్లను డీఎస్పీ రఘువీర్ అభినందించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇంటి తాళాలను రాడ్డుతో పగలగొట్టి సుమారు 20 తులాల వెండి పట్టీలు, రూ.5వేల నగదు దొంగిలించారన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గస్తీ నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లకు తాళ్లపొలం రైల్వేగేటు సమీపంలో బైక్‌పై ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారన్నారు. వెంటనే ద్రాక్షారామ ఎస్సై లక్ష్మణ్‌కు సమాచారమివ్వడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తే నేరం ఒప్పుకున్నారన్నారు. దొంగతనానికి పాల్పడిన పెద్దాపురానికి చెందిన సిమ్మా మణికంఠ, నల్గొండ జిల్లా లక్ష్మీపురం తండాకు చెందిన ఆమ్‌గోతు బాబు, పాతర్లగడ్డ తండాకు చెందిన రమావత్ కోటేష్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన



రైతులకు ఎరువులు అందజేస్తున్న ఏడీఏ, ఏఓ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ బి.నాగకుమార్ మాట్లాడుతూ, రైతులు వరి పంటలో తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. వివిధ దశల్లో వాడాల్సిన ఎరువులు, పురుగు మందులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మణిదీప్ మాట్లాడుతూ, ద్రవ రూప జీవన ఎరువు అయిన ఫాస్పో బ్యాక్టీరియా (పీఎస్‌బీ)ని వివిధ దశల్లో ఏ విధంగా ఉపయోగించుకోవాలనేది రైతులకు వివరించారు. అదే విధంగా ఇన్సూరెన్స్ కోసం ఎకరాకు రూ.76లు ప్రీమియంగా చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వద్ద పంట నష్టపోతే రూ.38వేలు బీమా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నైపుణ్యానికి అద్దంపట్టేలా ఫొటోగ్రఫీ

కపిలేశ్వరపురం (మండపేట): మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యతకు అద్దంపట్టే ఫొటో, వీడియోగ్రఫీలతో ముందుకు సాగుదామని జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గెడ్డం సురేష్ కుమార్ అన్నారు. మండపేటలోని బ్రాహ్మణ సత్రంలో బుధవారం సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన మండపేట ఫొటోగ్రాఫర్ తేలు లోవరాజు కుటుంబానికి సంఘ సహాయనిధి నుంచి రూ.లక్ష, దాగురె సురక్ష యోజన పథకం నుంచి రూ.55వేలు, మండపేట యూనియన్ తరపున రూ.25వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బి.మల్లేశ్వర్, రామారెడ్డి, కార్యదర్శి దొరబాబు, ఉపాధ్యక్షుడు మనోజ్, మండపేట కమిటీ అధ్యక్షుడు వెంకటేష్, జిల్లాలోని 19 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెం గ్రామంలో ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తాళ్లపొలం గ్రామానికి చెందిన వనుం కృష్ణ (48) మృతి చెందినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ బుధవారం తెలిపారు.

మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జింక్ లోపిస్తే.. అనర్థాలే

- జింక్ లోపముంటే ఎరువులన్నీ వ్యర్థమే
- వరిలో మొక్కల పెరుగుదలకు 16 రకాలు అవసరం
- సాగులో పైరు కోసం యాజమాన్య పద్ధతులు



పెరగని దిగుబడులు..

జింక్ లోపాన్ని ఇలా గుర్తించవచ్చు..

రాయవరం: గత మూడు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతుండటంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సాగులో పైరు కోసం ఎరువుల యాజమాన్య పద్ధతులు సద్వినియోగం కావాలన్నా, అధిక దిగుబడులు పొందాలన్నా జింక్ లోప నివారణకు ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వరిలో సూక్ష్మ పోషకమైన జింక్ లోపించిందంటే పలు అనర్థాలు తలెత్తుతాయి. జింక్ లోప లక్షణాలను అధిగమించడానికి అవసరమైన సూచనలను మండపేట మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఇలా వివరిస్తున్నారు.

మొక్కల పెరుగుదలకు జింక్ పాత్రే కీలకం..

మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాల్లో నత్రజని, భాస్వరం, పొటాషియం ప్రధానమైనవి. వీటితో పాటు, సూక్ష్మ పోషకాలైన జింక్, కాల్షియం, మెగ్నీషియం, రాగి వంటి 16 రకాలూ అవసరమే. ఇందులో జింక్ పాత్ర చాలా కీలకం. ప్రధాన పోషకాలతో పోల్చితే ఇది చాలా తక్కువ పరిమాణంలో అవసరమైనా, ప్రాముఖ్యత విషయంలో ప్రధాన పోషకాలతో సమానంగా ఉంటుంది. ఇది లోపిస్తే ఎన్ని ఎరువులు వేసినా వ్యర్థమే అవుతుంది. జింక్ లోపముంటే నత్రజని, భాస్వరం, పొటాష్ ఎంత వేసినా వృథా అవుతూనే ఉంటాయి. దిగుబడులు ఏ మాత్రం పెరగవు. మొక్కలు ఎరువులను సమర్థవంతంగా ఉపయోగించుకోలేవు. పెరుగుదల ప్రక్రియలో జింక్ వివిధ క్రియలను నిర్వర్తిస్తుంది. మొక్కల పెరుగుదల కోసం పలు రసాయన ప్రక్రియల్లో అవసరమయ్యే ఎంజైముల చురుకుదనాన్ని పెంచడానికి, ఉత్తేజ పర్చడానికి జింక్ ఉపయోగపడుతుంది. రసాయనిక క్రియల్లో కావాల్సిన హార్మోన్ల ఉత్పత్తికి అవసరమయ్యే రసాయనిక పదార్థాల తయారీకి జింక్ దోహదపడుతుంది.

వరిలో నారుమడి దశ, నాటిన తర్వాత కూడా జింక్ లోపం కనిపిస్తుంది. సాధారణంగా నాట్లు వేశాక రెండు నుంచి నాలుగు వారాల మధ్య, నాలుగు నుంచి ఆరో వారం వరకు జింక్ లోప లక్షణాలు బయట పడతాయి. జింక్ లోపం ఉన్న పొలంలో ప్రధాన పోషకాలు తగినంత వేసినా పంట సరిగ్గా పెరగదు. పైరు ఏపుగా పెరగదు. పిలకలు పెట్టదు. పొలం గుంపులు గుంపులుగా చనిపోయి ఖాళీగా కనిపిస్తుంది. పొలమంతా పసుపు పచ్చగా కన్పిస్తుంది. దగ్గరగా చూస్తే మొక్కల్లో పైనుంచి మూడు లేక నాలుగు ఆకుల మధ్య ఈనె మొదలు భాగం ఆకుపచ్చ రంగు కోల్పోయి పసుపుతో కూడిన తెలుపు రంగులోకి మారుతుంది. ఆకులోని మిగిలిన భాగమంతా ఆకుపచ్చగానే ఉంటుంది. ముదురాకుల్లో ఆకుల కొనల వద్ద మధ్యలో ఈనెకు ఇరువైపులా తుప్పురంగు లేక ఇటుక రంగుమచ్చలు కనిపిస్తాయి. ఆకులు చిన్నగా, నూలు కండెలుగా మారి మొద్దు బారుతాయి. ఆకులు గట్టిగా మారి వంచి చూస్తే శబ్ధం చేస్తాయి.

లోప నివారణ చర్యలివే..

పంట వేసే ముందే మట్టి పరీక్ష చేయించుకోవాలి. జింక్ తగినంత ఉందో లేదో తెలుసుకోవాలి. జింక్ లోపమున్నట్లు తేలితే.. ముందుగానే సరైన మోతాదులో జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. వరి పంటకైతే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను దుక్కిలో నాటే ముందు వేసుకోవాలి. మూడు పంటలకోసారి, రెండేళ్లకోసారి గానీ వేసుకోవాలి. ప్రతి ఏడాది వరి వేసుకోవాలనుకుంటే రబీలోనే జింక్ వేసుకోవాలి. క్షార, చవుడు, సున్నపు వంటి సమస్యాత్మక నేలలైతే జింక్ సల్ఫేట్‌ను ఎకరాకు 40కిలోల చొప్పున వేసుకోవాలి.

అందులో లోపం కనిపిస్తే..

పంటపై జింక్ లోపం ఉంటే 10 లీటర్ల నీటికి 20గ్రాముల జింక్ కలిపి ఎకరానికి 200 లీటర్ల చొప్పున పిచికారి చేయాలి. ఇలా వారం రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారి చేస్తే ఫలితం ఉంటుంది. ఎకరానికి రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు, కంపోస్టు, కోడి ఎరువు వంటి సేంద్రియ ఎరువులతో 15కిలోల జింక్ కలిపి నెల రోజులపాటు మాగనిచ్చి, నాటే ముందు దుక్కిలో వేస్తే దిగుబడుల్లో మార్పు కనిపిస్తుంది.

శివనాథుడికి బిల్వ దళాలతో పూజలు

కపిలేశ్వరపురం (మండపేట): మాస శివరాత్రిని పురస్కరించుకుని మండపేటలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం శివనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. కొప్పాక సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్రహ్మణ్య నంబూద్రి 22 మంది మాలధారులచే పూజలు చేయించారు. అష్టోత్తర శతనామాలు, బిల్వ దళాలు, పూలు సమర్పించారు. మాలధారులు కోన సత్యనారాయణ, కాళ్ల సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ముగియనున్న ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం (మండపేట): 0- 6 ఏళ్ల చిన్నారుల ఆధార్ కార్డులోని వివరాలను మార్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మండపేటలోని పలు ప్రాంతాల్లో ఈనెల 15 నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఈనెల 25తో ముగియనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు బుధవారం తెలిపారు. మొదటి విడతలో 15 నుంచి 18 వరకూ విజయవంతంగా నిర్వహించామన్నారు. మరోసారి ఈ శిబిరాలు 22న ప్రారంభం కాగా, రేపటితో ముగియనున్నాయన్నారు. బురుగుంట చెరువు సమీపంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 4వ వార్డు సచివాలయం, వల్లూరి వారి వీధిలోని కచేరి చావిడి వద్ద ఉన్న 7వ వార్డు సచివాలయంలో ఆధార్ వివరాల మార్పిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు బుధవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని అంగర, వల్లూరు విద్యుత్ ఫీడర్ల పరిధిలోని లైన్లకు మరమ్మతు పనులు చేస్తున్నందున అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, టేకి, మాచరమట్లు, శ్రీరాంపురం, వల్లూరు గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ప్రమాదాలకు నిలయంగా ఉన్న మలుపు

కె.గంగవరం: మండలంలోని తామరపల్లి ప్రారంభంలో ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. రెండు చోట్ల ప్రమాదకరంగా మలుపులు ఉండగా, ప్రక్కనే చెరువు ఉండటంతో ప్రయాణికులు క్షతగాత్రులవుతున్నారని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం ఇసుక లారీలు మలుపుల వద్ద కూడా స్పీడ్ తగ్గించకుండా వస్తున్నాయని చెబుతున్నారు. రహదారి నిర్మించినప్పటి నుంచి అధికారులకు స్పీడ్ బ్రేకర్లు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ హిత బ్యాగుల తయారీ



పర్యావరణ హిత బ్యాగులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కపిలేశ్వరపురం (మండపేట): ద్వారపూడి జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పర్యావరణ హిత బ్యాగులను తయారు చేసి సామాజిక బాధ్యతను చాటారు. సుమారు 150 మంది విద్యార్థినులు వారి ఇంట్లో ఉన్న పాత వస్త్రాలను పీలికలుగా మార్చి క్లాత్ బ్యాగులను తయారు చేశారు. వారు తయారు చేసిన 300 సంచులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ విద్యార్థినులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా.. సామాజిక స్థితిగతులను అవగాహన చేసుకోవడం అభినందించ తగినదన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజరాజేశ్వరి భ్రమరాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌కు కార్మికుల కృతజ్ఞతలు



మండపేటలో చైర్‌పర్సన్‌ను సన్మానించిన కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): తమ వేతనాలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండపేట మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు దీర్ఘకాలంపాటు పోరాటం చేశారు. తొలుత రాష్ట్ర వ్యాప్తంగా విజ్ఞాపన పత్రాలను సమర్పించినప్పటికీ అప్పట్లో ప్రభుత్వం ఖాతరు చేయలేదు. మరో దశలో చర్చలకు పిలిచి హామీనివ్వడంతో కార్మికులు సమ్మెను విరమించుకున్నారు. తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో మరోసారి సమ్మెకు దిగారు. ఇలా రెండు విడతలుగా అవుట్ సోర్సింగ్ కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టారు. అప్పుడు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి కార్మికుల పక్షాన నిలబడ్డారు. వారి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. తీవ్రమైన ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం వారి వేతనాలను స్వల్పంగా పెంచింది. తమ పోరాటంలో అండగా నిలిచిన దుర్గారాణికి కార్మికులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు.